క్లుప్తంగా

కుటుంబ సర్వే ప్రారంభం

ఖిలా వరంగల్: వరంగల్ రైల్వేగేట్ ప్రాంతంలోని పలు డివిజన్లలో కుటుంబాల గుర్తింపు, స్టిక్కర్లు అతికించే ప్రక్రియ శుక్రవారంతో ముగిసింది. ఈమేరకు శనివారం సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ప్రారంభమైంది. ప్రజల నుంచి సమగ్ర వివరాలను ఎన్యుమరేటర్లు సేకరించారు. మొదటి రోజు సమగ్ర సర్వే ప్రశాంతంగా సాగింది. కార్యక్రమంలో కార్పొరేటర్లు ముస్కమల్ల అరుణ, దిడ్డి కుమారస్వామి, సువర్ణ, ఉమ, గద్దె బాబు, మరుపల్లి రవి, పల్లం పద్మ, ఈదుల అరుణ, గుండు చందన తదితరులు పాల్గొన్నారు.

అంజన్నకు లక్షపూలతో ప్రత్యేక అలంకరణ



కాజీపేట: కాజీపేట 63వ డివిజన్ జూబ్లీమార్కెట్‌లో దక్షిణముఖంగా కొలువుదీరిన అభయాంజనేయ స్వామికి భక్తులు లక్ష పూలతో శనివారం ప్రత్యేక అలంకరణ చేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుల పర్యవేక్షణలో పూలతో అలంకరించారు. కార్తీక మాసోత్సవాన్ని పురస్కరించుకుని దేవాలయ ప్రధాన పూజారి జాగర్లపూడి శ్రీనివాస్‌శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకాలు, అర్చనలతో పాటు అలంకరణ చేశారు. అనంతరం భక్తులకు మహాన్నదానం చేశారు.

22న అంబేడ్కర్ భవన్‌లో విద్యార్థి యుద్ధభేరి మహాసభ

నయీంనగర్: సంక్షేమ హాస్టళ్ల, గురుకులాలకు మెస్ చార్జీలు పెంచాలని, సొంత భవనాలు నిర్మించాలని డిమాండ్ చేస్తూ నవంబర్ 22న అంబేడ్కర్ భవన్‌లో విద్యార్థి యుద్ధభేరి మహాసభ నిర్వహించనున్నట్లు తెలంగాణ సోషలిస్టు స్టూడెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు కూరెళ్ల మహేష్‌కుమార్ తెలిపారు. ఈమేరకు హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 22న హనుమకొండ అంబేడ్కర్ సెంటర్ నుంచి అంబేడ్కర్ భవన్ వరకు వందలాది మంది విద్యార్థులతో ర్యాలీ నిర్వహించనున్నట్లు వివరించారు. అనంతరం సభ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య హాజరవుతారని చెప్పారు. కార్యక్రమంలో సత్యనారాయణ, మేడి రాజు, గోవిందరాజు, నవీన్, శివ తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా గోవులను తరలిస్తున్న ఐదుగురిపై కేసు

కాజీపేట: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఓ టాటాఏస్ వాహనంలో గోవులను తరలిస్తున్న ఐదుగురు వ్యక్తులపై కాజీపేట పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. ఎస్సై శివకృష్ణ కథనం ప్రకారం బాపూజీనగర్ ప్రాంతంలో ఏఎస్సై శ్రీధర్ పెట్రోలింగ్ చేస్తుండగా అందిన సమాచారం మేరకు పోలీసులు దాడిచేసి వాహనంలో తరలిస్తున్న గోవులను పట్టుకున్నారు. ఆ గోవులకు పశువైద్యాధికారితో పరీక్షలు చేయించి గోశాలకు అప్పగించారు. గోవులను తరలిస్తున్న బాలిరెడ్డి, బాబురావు, రాజేష్, ఇమ్రాన్, పాషాపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

పీహెచ్‌సీ తనిఖీ



హసన్‌పర్తి: హసన్‌పర్తిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ డాక్టర్ అల్లెం అప్పయ్య శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రి వార్డులు, లాబోరేటరీ రూంలను పరిశీలించి, రికార్డులను పరిశీలించారు. ఆస్పత్రిలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డాక్టర్ మహేందర్, సీహెచ్‌ఎల్ మేరినా, సూపర్‌వైజర్ రుతమ్మ, లచ్చు, ఫార్మసిస్ట్ అజిత్, స్టాఫ్ నర్స్ విజయకుమారి, రేణుక, ల్యాబ్ టెక్నీషియన్ జనార్దన్, హెల్త్ సూపర్‌వైజర్ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

20న కాంగ్రెస్ సేవాదళ్ దశాబ్ది ఉత్సవాలు

హన్మకొండ చౌరస్తా: ఈనెల 20వ తేదీన హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో జరగనున్న తెలంగాణ కాంగ్రెస్ సేవాదళ్ దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని రాష్ట్ర సేవాదళ్ జనరల్ సెక్రటరీ సుంకరి శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. హనుమకొండలోని డీసీసీ భవన్‌లో శనివారం జరిగిన సేవాదళ్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావడంలో సేవాదళ్ కార్యకర్తల కృషి మరువలేనిదని కొనియాడారు. సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు మిద్దెల జితేందర్ అధ్యక్షతన జరిగే దశాబ్ది ఉత్సవాలకు జిల్లా నుంచి సేవాదళ్ కార్యకర్తలు, నాయకులు పాల్గొనాలని కోరారు. నకిరేకంటి మోహన్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో చర్లకొండ సదానందం, ఆదినారాయణ, కర్ణకంటి అరుణ, పల్లవు యాదగిరి, సురేందర్, దొమ్మాటి రాజేష్, సయ్యద్, సోమయ్య పాల్గొన్నారు.

నేరెళ్లవాగు బ్రిడ్జికి మోక్షమెప్పుడో..?

- కుప్పకూలి ఏడాదిన్నర..
- రాకపోకలకు తప్పని తిప్పలు
- నిర్మాణం చేపట్టాలని ప్రజల డిమాండ్



గతేడాది వచ్చిన భారీ వరదలకు కుప్పకూలిన నేరెళ్లవాగు బ్రిడ్జి

వేలేరు : మండలంలోని గుండ్లసాగర్ నుంచి చిల్పూర్ మండలం వెంకటాద్రిపేట గ్రామాలను కలుపుతూ గుండ్లసాగర్ శివారులో గల నేరెళ్ల వాగుపై నిర్మించిన బ్రిడ్జి నేలమట్టమై ఏడాదిన్నర గడుస్తున్నా బ్రిడ్జి నిర్మాణానికి మోక్షం లభించడం లేదు. సంబంధిత శాఖ అధికారులు, బ్రిడ్జి పనులు చేపట్టిన కాంట్రాక్టర్ తొంగిచూడడం లేదనే విమర్శలు వస్తున్నాయి. 2023 సంవత్సరం ఆగస్టులో కురిసిన భారీ వర్షాలకు బ్రిడ్జి నేలమట్టంకాగా గుండ్లసాగర్ నుంచి వెంకటాద్రిపేటకు 4 కిలోమీటర్లు బీటీ రోడ్డు, వాగుపై బ్రిడ్జి నిర్మించేందుకు సుమారు రూ.3 కోట్ల నిధులు మంజూరయ్యాయి. గుండ్లసాగర్ ప్రైమరీ పాఠశాల నుంచి నేరెళ్లవాగు వరకు రూ.1కోటి10లక్షలు, నేరెళ్లవాగు నుంచి వెంకటాద్రిపేట వరకు సుమారు రూ.1కోటి90 లక్షల నిధులు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం హయాంలో ప్రస్తుత జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య నిధులు మంజూరు చేయించి పనులు ప్రారంభించారు. గుండ్లసాగర్ నుంచి వెంకటాద్రిపేట వరకు మట్టిరోడ్డు, దానిపై కంకర పోసి రోలింగ్ చేసి, వంతెన నిర్మాణ పనులు పూర్తిచేశారు. కాగా ఈ రోడ్డుపై బీటీ వేయాల్సి ఉన్నప్పటికీ సంబంధిత కాంట్రాక్టర్ ఇప్పటివరకు పనులు పూర్తి చేయలేదు.

కంకర పోసి వదిలేశారు..



బీటీ వేయకుండా వదిలేసిన కంకర రోడ్డు

రోడ్డుపై కంకర పోసి వదిలేయడంతో వాహనదారులు, వ్యవసాయ బావులకు వెళ్లే రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆగ్రహిస్తున్నారు. బ్రిడ్జి నిర్మాణంలో కాంట్రాక్టర్ నాసిరకంగా పనులు చేయడంతోనే 2023 సంవత్సరంలో వచ్చిన భారీ వర్షాలకు బ్రిడ్జి కూలిపోయిందని ఆరోపిస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి బ్రిడ్జి నిర్మించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

బీటీరోడ్డు వేసి, బ్రిడ్జి నిర్మించాలి



ఎడాదిన్నర గడుస్తున్నా అధికారులు, సంబంధిత కాంట్రాక్టర్ ఎలాంటి మరమ్మతులు చేపట్టడం లేదు. అలాగే రోడ్డుపై కంకర పోసి వదిలేయడంతో ఆ రోడ్డుపై ప్రయాణించాలంటే తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదు. అలాగే వరదలకు కూలిపోయిన బ్రిడ్జి స్థానంలో పిల్లర్లు వేసి కొత్త బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి

\- మహేష్, గుండ్లసాగర్

అర్హులందరికీ ఇళ్లు నిర్మించి ఇవ్వాలి

- సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి



మాట్లాడుతున్న భిక్షపతి

శాయంపేట : రాష్ట్రంలోని అర్హులందరికీ ప్రభుత్వ స్థలంలో ఇళ్లు నిర్మించి ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శనివారం ఆ పార్టీ మండల కార్యదర్శి సదానందం అధ్యక్షతన ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. పార్టీ ఆవిర్భవించి వందేళ్లు పూర్తవుతున్న సందర్భంగా డిసెంబర్ 30 నుంచి 2026 డిసెంబర్ వరకు పార్టీ పోరాట చరిత్రను, ఉద్యమాలను గ్రామగ్రామాన తెలియపరిచేందుకు సమావేశాలు, సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు. పెద్దకోడెపాక రెవెన్యూ శివారులోని ప్రభుత్వ భూమిలో నిరుపేదలకు గుడిసెలు ఏర్పాటు చేయించామని, అర్హులందరికీ ఇళ్ల స్థలాలు, పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ ప్రభుత్వాన్ని కోరారు. అలాగే రైతులకు గిట్టుబాటు ధర కల్పించి గన్ని సంచుల కొరత లేకుండా చూడాలని, ధాన్యాన్ని ఎప్పటికప్పుడు కొనుగోలు చేయాలని కోరారు. వంద రోజుల్లో నిత్యావసర వస్తువుల ధరలు తగ్గిస్తామని మూడోసారి అధికారి చేపట్టిన బీజేపీ ధరల నియంత్రణలో విఫలం చెందిందని ఆరోపించారు. విజిలెన్స్ అధికారులతో బ్లాక్ మార్కెట్ వ్యాపారులపై దాడులు చేయించి నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. జిల్లా సహాయ కార్యదర్శి భిక్షపతి, సహాయ కార్యదర్శి అశోక్ పాల్గొన్నారు.

భూమి ఇప్పించి న్యాయం చేయండి



పట్టాపాసుబుక్ చూపిస్తున్న బాధిత రైతులు

శాయంపేట : 1996లో కొనుగోలు చేసిన భూమికి ప్రభుత్వం పట్టాపాస్‌బుక్ జారీ చేసిందని, కాస్తులో కూడా తామే ఉన్నప్పటికీ మరో రైతు ఆ భూమి చుట్టూ సిమెంటు పోల్స్ వేసి స్వాధీనం పర్చుకునేందుకు ప్రయత్నిస్తున్నాడని మా భూమి మాకు ఇప్పించి న్యాయం చేయాలని రైతు చిట్టిరెడ్డి రమాదేవి-రాజిరెడ్డి అధికారులను వేడుకున్నారు. మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో శనివారం విలేకరులతో మాట్లాడారు. పత్తిపాక గ్రామ శివారులోని సర్వే నంబర్ 532/బిలో 30 గుంటల భూమిని 1996లో చిట్టిరెడ్డి జక్కిరెడ్డి వద్ద నుంచి గుంటకు రూ. 550 చొప్పున 30 గుంటల భూమిని కొనుగోలు చేశామని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పట్టాపాస్ బుక్ జారీ తెసిందని తెలిపారు. ఈ భూమిపై రైతు బంధు పెట్టుబడి సాయం కూడా బ్యాంక్ ఖాతాలో జమ అయ్యిందని, కాస్తులో తామే ఉన్నామని తెలిపారు. అయినా అదే గ్రామానికి చెందిన రజనీకర్‌రెడ్డి మా భూమి వద్దకు వచ్చి దౌర్జన్యంగా ఇబ్బందులకు గురి చేస్తున్నాడని వాపోయారు. తహసీల్దార్, ఆర్డీఓ, జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఇటీవల భూమిలో సిమెంట్ పోల్స్ వేయడంతో కూలగొట్టినట్లు తెలిపారు. ఇదే విషయమై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని, అతనితో తమకు ప్రాణభయం ఉందని పేర్కొన్నారు. మా భూమి మాకు ఇప్పించి న్యాయం చేయాలని బాధిత రైతు వేడుకున్నాడు.

ఇంటింటి సర్వేకు ప్రజలు సహకరించాలి



కమలాపూర్ : సర్వేను పర్యవేక్షిస్తున్న రాంరెడ్డి



ఆత్మకూరు : సర్వేచేస్తున్న ఉపాధ్యాయుడు

కమలాపూర్ : సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు వచ్చే ఎన్యుమరేటర్లకు పూర్తి సమాచారం అందించి ప్రజలు సహకరించాలని బీసీ సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్, మండల ప్రత్యేకాధికారి రాంరెడ్డి కోరారు. మండలంలోని ఉప్పల్‌లో నిర్వహిస్తున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను శనివారం ఆయన పరిశీలించి ఓ కుటుంబ వివరాలు నమోదు చేయించారు. సర్వేకు సంబంధించి ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లకు పలు సూచనలు చేశారు. ఏ ఒక్క గృహం, ఏ ఒక్క కుటుంబం తప్పిపోకుండా, ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా సర్వే పకడ్బందీగా చేయాలన్నారు. అదే విధంగా ఎంపీడీఓ గుండె బాబు, ఎంపీఓ రవి పలు గ్రామాల్లో నిర్వహిస్తున్న సర్వేను పర్యవేక్షించారు.

ఆత్మకూరు : మండలంలో చేపట్టిన కులగణన సర్వే శనివారం కొనసాగింది. ఎన్యుమరేటర్లు ఇంటింటికెళ్లి కుటుంబ సభ్యుల వివరాలు సేకరించారు. ఎన్యుమరేటర్లకు పూర్తి సమాచారం ఇచ్చి సహకరించాలని ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి కోరారు.

శాయంపేట : ప్రభుత్వం చేపట్టిన కులగణన సర్వే మండలంలో శనివారం కొనసాగింది. సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి రాజకీయ తదితర అంశాలను ఎన్యుమరేటర్లు సేకరించారు. సర్వేను ఎంపీఎస్‌ఓ ప్రవీణ్‌కుమార్, ఎంపీడీఓ ఫణిచంద్ర, ఎంపీఓ రంజిత్‌కుమార్, ఏఓ గంగాజమున పర్యవేక్షించారు.

నడికూడ : రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సమగ్ర ఇంటింటి సర్వే మండలంలోని గొల్లపల్లిలో శనివారం కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మలహల్‌రావు ప్రారంభించారు. ఎన్యుమరేటర్ నీరటి రాములు, కాంగ్రెస్ నాయకులు తాళ్ల నవీన్, అప్పం కుమారస్వామి, రావుల సురేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

గుట్కా ప్యాకెట్ల పట్టివేత

వేలేరు : మండలంలోని పీచర గ్రామంలో గల కిరాణషాపుల్లో గుట్కా అమ్ముతున్నారనే సమాచారం మేరకు తనిఖీలు చేసినట్లు ఎస్సై సురేష్ తెలిపారు. పీచర గ్రామంలోని మారబోయిన అశోక్ కిరాణషాపులో రూ.820 విలువచేసే గుట్కా ప్యాకెట్లు లభించగా సీజ్ చేసి అశోక్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఆర్యవైశ్యుల అభ్యున్నతికి కృషి

హసన్‌పర్తి: ఆర్యవైశ్యుల అభ్యున్నతికి కృషి చేస్తానని సంఘం జిల్లా అధ్యక్షుడు తోట సురేష్ అన్నారు. అధ్యక్షుడిగా సురేష్, ప్రధాన కార్యదర్శిగా మోహన్ ఎన్నికైన అనంతరం తొలిసారిగా హసన్‌పర్తికి వచ్చిన సందర్భంగా వారిని ఆర్యవైశ్య సంఘం హసన్‌పర్తి శాఖ సభ్యులు శనివారం సన్మానించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ నిరుపేద ఆర్యవైశ్యులకు చేయూతనిస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం హసన్‌పర్తి మండల శాఖ అధ్యక్షుడు చకిలం రాజేశ్వరరావు, సంఘం సభ్యులు నాగమళ్ల సుధీర్, గౌరిశెట్టి కృష్ణమూర్తి, వెలగందుల భీష్మనాథం, నాగేందర్, ప్రకాష్, శంకర్ పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి : తహసీల్దార్



శాయంపేట : ఓటరు నమోదును పరిశీలిస్తున్న తహసీల్దార్ సత్యనారాయణ



ఐనవోలు : బీఎల్‌ఓలతో మాట్లాడుతున్న తహసీల్దార్ విక్రమ్‌కుమార్, ఆర్‌ఐ మల్లయ్య

శాయంపేట : 2025 జనవరి 1 వరకు 18 ఏళ్లు నిండిన యువతి, యువకులు ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ కాల్వల సత్యనారాయణ సూచించారు. ఈ మేరకు శనివారం బీఎల్‌ఓలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. మండలంలోని 42 పోలింగ్ కేంద్రాల్లో నిర్వహిస్తున్న స్పెషల్ క్యాంపును సందర్శించి పలు సూచనలు చేశామన్నారు. స్పెషల్ క్యాంపెయిన్ డే సందర్భంగా బీఎల్‌ఓలు శని, ఆదివారం అందుబాటులో ఉంటారని, ఓటరు నమోదు, సవరణను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఓటరు జాబితాలో తప్పులు ఉన్నట్లయితే ఫారం-8 ద్వారా సవరించుకోవాలని, కొత్త ఓటరు నమోదుకు ఫారం-6 ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో సూపర్‌వైజర్ ఆర్‌ఐ రమేశ్, సీనియర్ అసిస్టెంట్ అచ్చారావు, జూనియర్ అసిస్టెంట్ శైలజ, బీఎల్‌ఓలు సత్యం, సదయ్య, రత్నమాల, శ్వేత, రాజు, తులసి, మోహన్ పాల్గొన్నారు.

ఐనవోలు : 18 సంవత్సరాలు నిండిన యువతి, యువకులు ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ విక్రమ్ కుమార్ కోరారు. మండలంలో శనివారం ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం జరుగుతుండగా ఆర్‌ఐ మల్లయ్యతో కలిసి వివిధ గ్రామాలను సందర్శించి బీఎల్‌ఓల పనితీరును పరిశీలించారు. ఓటరు నమోదుకు ఫారం 6, జాబితాలో అభ్యంతరాలకు ఫారం 7, సవరణలకు ఫారం 8ని వినియోగించాలని సూచించారు. ఎలాంటి తప్పిదాలకు ఆస్కారం లేకుండా బీఎల్‌ఓలు పనిచేయాలన్నారు. మండల వ్యాప్తంగా వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలో 35 పోలింగ్ బూత్‌లు ఉండగా 35 మంది బీఎల్‌ఓలు పాల్గొని ఆరుగురు నూతన ఓటర్లను నమోదు చేసినట్లు తెలిపారు. స్టేషన్ ఘణపూర్ నియోజకవర్గంలో నూతన ఓటర్లు నమోదు కాలేదని తెలిపారు.

కంటి వైద్యశిబిరం

శాయంపేట : మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో లయన్స్ విజన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. లయన్స్ క్లబ్ జనరల్ సెక్రటరీ, ఆప్తాల్మిక్ ఆఫీసర్ గుంటోజు వెంకన్న గ్రామంలోని 200 మందికి కంటి పరీక్షలు చేశారు. ఆపరేషన్లు అవసరమైన 50 మందిని గుర్తించి సికింద్రాబాద్ పుష్పగిరి నేత్ర వైద్యశాలకు రిఫర్ చేసినట్లు తెలిపారు. ఆరోగ్యంపై ప్రజలు దృష్టి సారించాలని సూచించారు. వైద్యుల సూచనలు పాటించాలని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రత్నాకర్, సూర్యనాయక్ తండా గ్రామ యూత్ అధ్యక్షుడు గుగులోతు జై గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ న్యాయమైన డిమాండ్



ధర్మసాగర్ : నియమాకపత్రం అందజేస్తున్న మందకుమార్

ధర్మసాగర్ : ఎస్సీ ఏబీసీడీ వర్గీకరణను న్యాయమైన డిమాండ్‌గా భావించి సుప్రీంకోర్టు అనుకూలంగా తీర్పు ఇచ్చిందని ఎంఎస్పీ జాతీయ నేత మంద కుమార్‌మాదిగ, ఎమ్మార్పీఎస్ నేత బొడ్డు దయాకర్‌మాదిగ అన్నారు. మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో శనివారం సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో వర్గీకరణ అమలుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, తప్పకుండా అమలు చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కానీ రెండునెలలు గడుస్తున్నా వర్గీకరణ మాటెత్తడం లేదని అన్నారు. వర్గీకరణ పోరాటానికి రాష్ట్రంలోని ప్రతీ మాదిగ బిడ్డ సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. అనంతరం ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ అనుబంధ సంఘాల కమిటీలను ఎన్నుకున్నారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడిగా సోంపెల్లి అన్వేష్, ఉపాధ్యక్షులుగా గంగారపు మధు, కొట్టె అంతోని, ప్రధాన కార్యదర్శిగా రాజు, ప్రచార కార్యదర్శిగా పవన్, సహాయ కార్యదర్శిగా సుమన్, ఉద్యోగుల సమాఖ్య మండల అధ్యక్షుడిగా కొలిపాక రమేశ్, ఉపాధ్యక్షుడిగా కరుణాకర్, ఎంఎస్పీ మండల అధ్యక్షుడిగా శంషొద్దీన్, అధికార ప్రతినిధిగా గంగారపు రాజేందర్, ప్రధాన కార్యదర్శిగా బాబు, వీహెచ్‌పీఎస్ మండల అధ్యక్షుడిగా బాబు, ఉపాధ్యక్షుడిగా పొలు ఎన్నికైనట్లు తెలిపారు. ఈ మేరకు నియమాక పత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్పీ జాతీయ నాయకుడు సూరన్న, శాంతిసాగర్, భిక్షపతి, దినేష్, సురేందర్, సుకుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

వేలేరు : ఎస్సీ వర్గీకరణ జరిగే వరకు రాష్ట్రంలో ఉద్యోగ నియమాకాలు నిలిపివేయాలని ఎంఎస్పీ జాతీయ నాయకుడు మందకుమార్‌మాదిగ, ఎమ్మార్పీస్ మాజీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొడ్డు దయాకర్ మాదిగ, వేల్పుల వీరన్న ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ మండల కమిటీని ఎన్నుకున్నట్లు తెలిపారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడిగా మనోజ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా మిడిదొడ్డి శ్రీకాంత్, ఉపాధ్యక్షులుగా మోతె పూర్ణచందర్, కార్యదర్శిగా కొట్టె వంశీ, కోశాధికారిగా రమేశ్‌ను ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. అలాగే ఎంఎస్పీ మండల అధ్యక్షుడిగా కనకం రాజయ్య, ప్రధాన కార్యదర్శిగా అక్కల శంకర్, ఉపాధ్యక్షుడిగా విజేందర్, అధికార ప్రతినిధిగా రామంచ ఏసును ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు.

దామెర : ఎమ్మార్పీస్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ధర్మయుద్ధం మహాసభను జయప్రదం చేయాలని మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా కోఆర్డినేటర్ మంద రాజు, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జన్ను దినేష్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల ముఖ్య కార్యకర్తల సమావేశం శనివారం జరుగగా దినేష్ మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ కోసం సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చి నాలుగు నెలలు అవుతున్నా రాష్ట్ర ప్రభుత్వం వర్గీకరణ కోసం చర్యలు తీసుకోకపోవడం సరికాదన్నారు. వర్గీకరణ కోసం ప్రభుత్వం కార్యాచరణ తీసుకోని పక్షంలో మంద కృష్ణమాదిగ ఆధ్వర్యంలో త్వరలో ఉద్యాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. డిసెంబర్ 21 నిర్వహించనున్న మాదిగల ధర్మయుద్ధం సభకు మాదిగలు, ఉప కులాలకు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. జిల్లా అధ్యక్షుడు సుకుమార్, నాయకులు సురేందర్, భిక్షపతి, శంకర్, మురళి, మండల అధ్యక్షుడు రవికుమార్, ప్రదీప్, ప్రేమ్‌సాగర్, రాజశేఖర్, మొగిలి, చిరంజీవి, జేమ్స్, భరత్, సాయన్న, బుచ్చయ్య పాల్గొన్నారు.

ముగిసిన పంచకూట శివాలయ ప్రతిష్ఠాపన



శోభాయాత్రలో పాల్గొన్న భక్తజనం

- వైభవంగా శోభాయాత్ర

ఆత్మకూరు: మండల కేంద్రంలో శనివారం మహాదేవస్వామి, పార్వతీ మాత ఉత్సవ విగ్రహాల శోభాయాత్ర వైభవంగా జరిగింది. మండల కేంద్రంలోని వీధుల్లో శోభాయాత్ర కొనసాగింది. రథాన్ని ప్రత్యేకంగా అలంకరించి విగ్రహాలను ఊరేగించారు. మహిళలు కోలాటాలు, నృత్యాలతో శోభాయాత్రలో పాల్గొన్నారు. భక్తులు మంగళహారతులతో స్వాగతం పలికారు. ఆలయ పునఃప్రతిష్ఠాపనకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ఆలయ కమిటీ చైర్మన్ వంగాల బుచ్చిరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అర్చకులు శివకిరణ్‌శర్మ, శ్రావణ్‌శర్మ, రవీందర్‌శర్మ, శరత్‌శర్మ, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బీసీ రాజ్యాధికార సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కవిత



కవితకు నియామక పత్రం అందజేస్తున్న సురేష్

హన్మకొండ చౌరస్తా: తెలంగాణ బీసీ రాజ్యాధికార సమితి రాష్ట్ర మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా హనుమకొండకు చెందిన కత్తుల కవిత నియమితులయ్యారు. ఈమేరకు హనుమకొండలో శనివారం జరిగిన ఉమ్మడి వరంగల్ జిల్లా కమిటీ సమావేశంలో కవితకు బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపకుడు దాసు సురేష్ నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ మహిళలు రాజకీయంగా మరింత చైతన్యవంతులు కావాలని సూచించారు. జనాభాలో బీసీల మహిళల ఓట్లు ఎక్కువగా ఉన్నాయని, వారి ఓటుతో రాజ్యాధికారాన్ని సాధించుకోవాలని అన్నారు. సమావేశంలో హనుమకొండ జిల్లా అధ్యక్షుడు గాజు యుగేందర్, ఏరుకొండ హైమావతి, ముంజల రాజేందర్, జూలూరి రమేష్, కల్లెబోయిన సురేందర్, తెలంగాణ కొమురయ్య, వీరేందర్, విష్ణు, కుమారస్వామి, మడత కిషోర్, జనార్దన్, కేయూ జేఏసీ నేత వీరబోయిన తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలపై పోరాడాలి

కేయూ క్యాంపస్: విద్యారంగ సమస్యలపై పోరాడాలని ఏబీఎస్‌ఎఫ్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు మంద నరేష్ కోరారు. కాకతీయ యూనివర్సిటీలో ఏబీఎస్‌ఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని క్యాంపస్‌లోని లైబ్రరీ వద్ద శనివారం నిర్వహించారు. విద్యారంగ, సామాజిక, రాజకీయ, కార్మిక, నిరుద్యోగ సమస్యలపై నిత్యం పోరాటం చేస్తున్నట్లు తెలిపారు.

తుడుందెబ్బ సభలను విజయవంతం చేయండి

నయీంనగర్: ఆదివాసీ హక్కుల పోరాటసమితి (తుడుందెబ్బ) తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో జరగనున్న జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని రాష్ట్ర కన్వీనర్ బుర్స పోచయ్య కోరారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆదివాసీల హక్కులను అక్రమంగా పొందుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని తుడుందెబ్బ పోరాటం చేస్తోందని గుర్తుచేశారు. అందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా సభలను నిర్వహించి ఆదివాసీలకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. డిసెంబర్ 3న హనుమకొండలో ఉమ్మడి వరంగల్ జిల్లా సభలు నిర్వహించనున్నట్లు వివరించారు. ప్రతీ ఆదివాసీ బిడ్డ తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు సిద్దబోయిన లక్ష్మీనారాయణ, పుష్పారాణి, రవీందర్‌తో పాటు, తదితరులు పాల్గొన్నారు.

11 నుంచి వారోత్సవాలు

హన్మకొండ కల్చరల్: ఈనెల 11 నుంచి 17వ తేదీ వరకు హనుమకొండలోని భవాని మాత దేవాలయంలో నిర్వహించనున్న కార్తీకమాస వారోత్సవాలను విజయవంతం చేయాలని టీటీడీ కార్యక్రమ నిర్వాహకుడు రామిరెడ్డి కృష్ణమూర్తి కోరారు.